# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 6, జూన్ 2026 | సంపుటి :03 | సంచిక :117 | పేజీలు :05 | వెల ₹5


## కలెక్టర్ ను కలిసిన డీటీఓ



అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ)గా బాధ్యతలు స్వీకరించిన వెంకన్న శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఐడిఓసి కార్యాలయంలో కలిసి మొక్కను అందజేశారు. భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహించిన మహమ్మద్ సంధాని జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లాలో సేవలందించిన వెంకన్న భూపాలపల్లి జిల్లా డీటీఓగా నియమితులయ్యారు. ములుగు జిల్లా నుండి బదిలీపై వచ్చిన ఎంవీఐ శ్రీనివాస్ కూడా జిల్లా కలెక్టర్ కు మొక్కను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధమే హత్యకు కారణం

- షరీఫుద్దీన్ కేసు ఛేదించిన పోలీసులు
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం విఫలం
- నిందితుడు సందీప్ అరెస్ట్
- ఏసీపీ సతీష్‌బాబు

03



## కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

### కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే నాయిని

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత పెద్ద ఎత్తున ముందుకు వస్తోందని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు యువ నాయకుల ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 400 మంది యువకులు శుక్రవారం ఎమ్మెల్యే నాయిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువ నాయకులు అక్కినపెల్లి అరవింద్, మాడిశెట్టి సుశీల్, తిరునహరి చిన్న బంటి నేతృత్వంలో తరలివచ్చిన యువతకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నేత విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న నియోజకవర్గ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, ముఖ్య నాయకులు తోట పవన్, కనిగంటి శేఖర్, కుమార్ యాదవ్, సైండ్ల శ్రీకాంత్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగ ప్రతినిధులు పాల్గొన్నారు.



# నకిలీపై నజర్

### ముందస్తుగా ఇప్పటికే విత్తన డీలర్లతో సమావేశాలు





నకిలీ విత్తనాలు అమ్మితే

## 'పీడీ యాక్ట్'

- రైతులను మోసం చేస్తే రెండేళ్లు జైలుకే
- బీజీ-3 పత్తి విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధం
- భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

- విత్తనాల అమ్మకంలో నిబంధనలు పాటించాలని స్పష్టం
- నకిలీ, అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వార్నింగ్
- మార్కెట్ లో విత్తనాల అమ్మకంపై అధికారులు గట్టి నిఘా
- విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు

04

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. విత్తనాల అమ్మకంపై దృష్టి సారించారు. ప్రధానంగా నకిలీ, అనుమతి లేని విత్తనాలు మార్కెట్ లోకి రాకుండా నిఘా పెట్టారు. ఇదే సమయంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల నుంచి ఆయా జిల్లాలో కలెక్టర్ వ్యవసాయ, పోలీస్ అధికారులు, విత్తన డీలర్లు, అసోసియేషన్ నేతలు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. విత్తనాల అమ్మకంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, నకిలీ, ప్రభుత్వ అనుమతి లేని విత్తనాల అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే నకిలీ, అనుమతి లేని విత్తనాలు అమ్మిన వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కూడా చెప్పారు. గట్టి నిఘా పెట్టడంతో పాటు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కూడా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. నకిలీ, అనుమతి లేని విత్తనాలు మార్కెట్ లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది.

– అక్షరదర్బార్, వరంగల్



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### అదనపు కలెక్టర్ ఎన్ రవి

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ రవి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. స్తంభమెక్కిన ఉపసర్పంచ్!

### కొత్తగట్టు సింగారంలో 'లైన్ మెన్'గా మారిన ప్రజాప్రతినిధి సాయి కృష్ణ




అక్షర దర్బార్, శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో తరచూ ఎదురవుతున్న కరెంట్ సమస్యలపై విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించకపోవడంతో విసిగిపోయిన గ్రామ ఉపసర్పంచ్ సాయి కృష్ణ స్వయంగా లైన్ మెన్ అవతారమెత్తారు. శుక్రవారం గ్రామంలో మళ్లీ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సకాలంలో స్పందించని అధికారుల తీరుపై నిరసనగా.. ఉపసర్పంచ్ సాయి కృష్ణ పంచాయతీ సిబ్బందితో కలిసి మండుటెండలో తానే స్వయంగా కరెంట్ స్తంభం ఎక్కారు. తెగిపోయిన 11 కేవీ విద్యుత్ తీగలను జాయింట్ చేసి గ్రామానికి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తమ గ్రామాన్ని కరెంట్ కష్టాల నుండి కాపాడాలని కోరారు. సకాలంలో స్పందించి సమస్యను తీర్చిన ఉపసర్పంచ్‌ను గ్రామస్థులు ఘనంగా అభినందించారు.

# మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్ కుటుంబానికి పరామర్శ

### షాలిని పార్థివదేహానికి నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి నివాళి

అక్షరదర్బార్, పరకాల : వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్ సతీమణి షాలిని ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సోదా కిరణ్ నివాసానికి వెళ్లిన ఆయన, షాలిని పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సోదా కిరణ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కొండంత ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి కూడా పాల్గొని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. షాలిని అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.



# పాత అరాచకాలకు చెక్

- ఆంధ్ర సీఐ డిస్మిస్‌తో మొగుళ్లపల్లిలో సంబరాలు
- ఒకప్పటి వివాదాస్పద ఎస్సైపై అత్యాచార ఆరోపణలు
- సర్వీస్ నుండి శాశ్వత తొలగింపు



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడనే బలమైన ఆరోపణలతో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన ఓ సీఐ పోలీస్ ఉన్నతాధికారులచే ఉద్యోగ సర్వీసు నుండి శాశ్వతంగా డిస్మిస్ కావడం మొగుళ్లపల్లి మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డిస్మిస్ అయిన ఆ పోలీస్ అధికారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1998 కాలంలో మొగుళ్లపల్లి ఎస్సైగా పనిచేశాడు. అప్పట్లో నక్సల్స్ మూమెంట్ ఉధృతంగా ఉన్న సమయంలో ఇక్కడ పనిచేసిన సదరు ఎస్సై.. స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల, పల్లెల్లోని ఒంటరి మహిళల పట్ల అత్యంత వివాదాస్పదంగా, అసాంఘికంగా ప్రవర్తించేవాడనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో అతని ప్రవర్తనను గమనించిన ఉన్నతాధికారులు రెండు ఏళ్లు కాకముందే ఇక్కడి నుండి బదిలీ చేశారు. ఆ తర్వాత సీఐగా ప్రమోషన్ పొంది, 317 జీవో ద్వారా ఆంధ్ర ప్రాంతానికి వెళ్లిన అతడు.. గత ఏప్రిల్ 29న ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. నెల రోజులుగా కోర్టుల్లో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించి విఫలమై, విధులకు గైర్హాజరై తప్పించుకు తిరుగుతుండటంతో ఉన్నతాధికారులు అతడిని సర్వీస్ నుండి డిస్మిస్ చేశారు. ఈ వార్త సోషల్ మీడియా ద్వారా తెలియడంతో మొగుళ్లపల్లి మండల ప్రజలు అప్పట్లోనే అతడు చేసిన అరాచకాలను గుర్తు చేసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు.




# చెట్లను పెంచండి.. భావితరాలకు చల్లని నీడనివ్వండి!

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొగుళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్సీసీ ర్యాలీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగుళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (జడ్పీహెచ్ఎస్) ఎన్సీసీ విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 10 తెలంగాణ బెటాలియన్ వరంగల్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సెంతిల్ రామదురై, కల్నల్ రవి సునారే ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఎన్సీసీ అధికారి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు 'చెట్లను పెంచండి – భావితరాలకు నీడనివ్వండి', 'ఓన్లీ వన్ ఎర్త్' (ఒకే ఒక భూమి) అనే నినాదాలతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎన్సీసీ అధికారి రాజయ్య మాట్లాడుతూ.. మానవుల స్వార్థం, అనాలోచిత నిర్ణయాల వల్ల ప్లాస్టిక్, రసాయనాలు పెరిగి పంచభూతాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సహజ వనరులు అంతరించిపోకుండా ఉండాలంటే ఎన్సీసీ విద్యార్థులందరూ దీక్షతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని రక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు టి. వెంకన్న, సీఆర్పీలు రాజయ్య, శ్రీనివాస్, అటెండర్ మజార్ పాల్గొన్నారు.



# నీటి చుక్క కోసం 'పరకాల' పరితాపం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


పైప్‌లైన్ల దెబ్బతినడంతో నిలిచిన నల్లా నీరు.. బావులపై ఆధారపడుతున్న జనం

అక్షరదర్బార్, –పరకాల : పరకాల పట్టణంలో తాగునీటి సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. పట్టణంలో సాగుతున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనుల సందర్భంగా మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో పలు ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుల్లో అధికారులు తీవ్ర జాప్యం చేయడంతో కొన్ని కాలనీలకు నల్లా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో బోర్లు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో నిత్యావసర అవసరాలకూ నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో కొందరు పాత బావులపై ఆధారపడుతుండగా, మరికొందరు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా వేలాది రూపాయలు పోసి నీటిని కొనుగోలు చేస్తున్నారు. చాలివాగుపై చెక్‌డ్యాం నిర్మాణం జరిగి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ పట్టణంలో పర్యటించి, దెబ్బతిన్న పైప్‌లైన్‌ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని పరకాల ప్రజలు కోరుతున్నారు.

# నాగుర్ల వెంకన్నకు 'బొడ్రాయి' ఉత్సవాల ఆహ్వానం

అక్షరదర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన సీతారాంపురం గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీలక్ష్మీ భూలక్ష్మీ సహిత నాభిశిలా (బొడ్రాయి), పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ గ్రామదేవతలతో పాటు నాగేంద్ర, నవగ్రహ నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్నకు ప్రత్యేక ఆహ్వానం అందింది. బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో వేగంగా సాగుతున్నాయన్నారు. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి, ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు.






## నూతన కమిషనర్ పోతురాజు పవన్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నేతలు

అక్షరదర్బార్, పరకాల : పరకాల పురపాలక సంఘం నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన గ్రేడ్-1 అధికారి పోతురాజు పవన్‌ను బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ.. పరకాల పట్టణానికి పూర్తిస్థాయి గ్రేడ్-1 అధికారి రావడం శుభపరిణామమన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 22 వార్డుల్లో పేరుకు పోయిన పారిశుధ్య సమస్యలను తీర్చడానికి, అంతర్గత అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. ఇన్‌చార్జి పాలన కారణంగా పట్టణ ప్రగతి కొంత వెనుకబడిందని, నూతన కమిషనర్ ఆధ్వర్యంలో పరకాల వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీఎల్ఓ సూపర్‌వైజర్లకు 'ఓటరు జాబితా' సవరణపై ప్రత్యేక శిక్షణ

అక్షరదర్బార్, పరకాల : రానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమ నిర్వహణపై బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు శుక్రవారం పరకాల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 104-పరకాల శాసనసభ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఈఆర్ఓలు, తహసీల్దార్లు టి. విజయలక్ష్మి (పరకాల), పి. రాణి (నడికూడ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ రాంబాబు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్–2026లో భాగంగా ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించడం, డిక్లరేషన్ ఫారాల వివరాలను ఆన్‌లైన్‌లో భర్తీ చేసే విధానాలపై బీఎల్ఓలకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ ఎస్. భద్రయ్య, ఎంఆర్ఐ పి. దామోదర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అక్రమ సంబంధమే హత్యకు కారణం

- షరీఫుద్దీన్ కేసు ఛేదించిన పోలీసులు
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం విఫలం
- నిందితుడు సందీప్ అరెస్ట్
- ఏసీపీ సతీష్‌బాబు




అక్షర దర్బార్, పరకాల : పరకాల సమీపంలోని వెల్లంపల్లి రహదారిపై ఈ నెల 2వ తేదీన జరిగిన మహమ్మద్ షరీఫుద్దీన్ (38) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. మొదట ఇది రోడ్డు ప్రమాదంగా కనిపించినప్పటికీ.. దీని వెనుక పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్యేనని దర్యాప్తులో తేలిందని పరకాల ఏసీపీ సతీష్‌బాబు మీడియాకు వెల్లడించారు. చర్లపల్లి గ్రామానికి చెందిన షరీఫుద్దీన్ హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా, అతని భార్య అజీరా బేగం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో టీ స్టాల్ నిర్వాహకుడైన జట్టబోయిన సందీప్‌కు అజీరా బేగంతో ఏర్పడిన పరిచయం అక్రమ సంబంధానికి దారితీసింది. తమ అక్రమ సంబంధానికి షరీఫుద్దీన్ అడ్డుగా ఉన్నాడనే కక్షతో సందీప్ అతడిని వదిలించుకోవాలని హత్యకు స్కెచ్ వేశాడు. ఈ నెల 2న రాత్రి ఇద్దరూ కలిసి వెల్లంపల్లి రోడ్డులోని ఒక షెడ్డులో మద్యం సేవిస్తుండగా.. భార్య విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దాంతో సందీప్ ముందే దాచిపెట్టిన కర్రతో షరీఫుద్దీన్ తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి రోడ్డుపై పడేసి ప్రమాదంగా చిత్రీకరించినట్లు నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడు. సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన సీఐ క్రాంతికుమార్, ఎస్ఐలు రమేశ్, పవన్‌లను ఏసీపీ అభినందించారు.



## మొక్కలు నాటండి.. పచ్చదనాన్ని పెంచండి!

- దుగ్గొండిలో పర్యావరణ దినోత్సవం..
- పాల్గొన్న ఎంపీడీవో అరుంధతి

అక్షర దర్బార్, దుగ్గొండి : పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని దుగ్గొండి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) డాక్టర్ లెక్కల అరుంధతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం దుగ్గొండి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై, సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్‌తో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఖాళీ స్థలాలలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని చెట్లుగా మారే వరకు సంరక్షించాలన్నారు. పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన వాతావరణం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహమ్మద్ వాజిద్, వైనల రాజు, ఉపాధి హామీ ఈసీ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ జన్ను అఖిల్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## దళితుల 'ఇంటి స్థలాల' భూమికి ఎట్టకేలకు మోక్షం!

- చిట్యాలలో పెండింగ్ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీవో



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న దళితుల ఇళ్ల స్థలాల భూమి సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 162, 166 లలో ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 5 ఎకరాల భూమిని భూపాలపల్లి ఆర్డీవో స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు లేఅవుట్ ఏర్పాటులో జరిగిన ఆలస్యానికి గల కారణాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సదరు భూమి సరిహద్దులను నిర్ధారించి, ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం అద్భుతమైన లేఅవుట్ ప్లాన్ తయారు చేయాలని, అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎలాంటి తగాదాలు లేకుండా అర్హులైన దళితులందరికీ న్యాయం జరిగేలా ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్థానిక తహసీల్దార్ వసంతరావును ఆర్డీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

## పద్మశాలి విద్యార్థులకు 'ఉచిత హాస్టల్' వసతి

### సద్వినియోగం చేసుకోవాలన్న శాయంపేట సంఘం అధ్యక్షుడు వంగర సాంబయ్య

అక్షర దర్బార్, శాయంపేట : ఇంటర్మీడియట్ నుండి పీజీ వరకు చదువుకుంటూ ఫీజులు చెల్లించలేని పేద పద్మశాలి సామాజికవర్గ బాలురకు హంటర్ రోడ్ లోని పద్మశాలి భవనంలో 'పద్మశాలి ట్రస్ట్' ద్వారా ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం శాయంపేట అధ్యక్షుడు వంగర సాంబయ్య తెలిపారు. హనుమకొండ జిల్లాలో చదువుకునే ఆసక్తి ఉన్న పద్మశాలి విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వివరాల కోసం వంగర సాంబయ్య (9704934379), జిల్లా కార్యదర్శి దిడ్డి రమేష్ (9849232056), రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ (6304721396) నంబర్లలో సంప్రదించవచ్చని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు చిందం రవి, బాసని ప్రకార్, వనం దేవరాజ్, బాసని నవీన్, ఆడెపు అశోక్ పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని రక్షించడం అందరి సామాజిక బాధ్యత

### నాచినపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల 'గ్రీన్ కోర్' ప్రతిజ్ఞ

దుగ్గొండి, అక్షర దర్బార్ : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాచినపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'నేషనల్ గ్రీన్ కోర్' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ.. పర్యావరణంలో పెరుగుతున్న కాలుష్యం వల్లే శీతోష్ణస్థితి మారిపోయి ప్రస్తుతం మనం తీవ్రమైన వేసవితాపం అనుభవిస్తున్నామన్నారు. ఈ కాలుష్య నివారణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి




సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడబోమని, ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి సంరక్షిస్తామని, నీటిని, కరెంట్‌ను పొదుపుగా వాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, మధుసూదన్ పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు, పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సీపీ తెలిపారు. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని పేర్కొన్న ఆయన, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నర్సింహారావు, నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 'నకిలీ'పై నజర్

- ముందస్తుగా ఇప్పటికే విత్తన డీలర్లతో సమావేశాలు
- విత్తనాల అమ్మకంలో నిబంధనలు పాటించాలని స్పష్టం
- నకిలీ, అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వార్నింగ్
- మార్కెట్ లో విత్తనాల అమ్మకంపై అధికారులు గట్టి నిఘా
- విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు



అక్షరదర్బార్, వరంగల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. విత్తనాల అమ్మకంపై దృష్టి సారించారు. ప్రధానంగా నకిలీ, అనుమతి లేని విత్తనాలు మార్కెట్ లోకి రాకుండా నిఘా పెట్టారు. ఇదే సమయంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల నుంచి ఆయా జిల్లాలో కలెక్టర్ వ్యవసాయ, పోలీస్ అధికారులు, విత్తన డీలర్లు, అసోసియేషన్ నేతలు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. విత్తనాల అమ్మకంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, నకిలీ, ప్రభుత్వ అనుమతి లేని విత్తనాల అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే నకిలీ, అనుమతి లేని విత్తనాలు అమ్మిన వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కూడా చెప్పారు. గట్టి నిఘా పెట్టడంతో పాటు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కూడా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. నకిలీ, అనుమతి లేని విత్తనాలు మార్కెట్ లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది.

**- నిఘా.. తనిఖీలు**

ఖరీఫ్ పంటల సాగు కోసం సిద్ధమైన రైతులు దుక్కులను చదును చేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో రెండు మూడు రోజుల నుంచి వర్షం కురిసింది. మరో ఒకటి రెండు వానలు పడితే విత్తనాలు నాటేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా కొందరు మార్కెట్ లో పత్తి, మొక్కజొన్న ఇతర పంటల విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో అధికారులు మార్కెట్ లో విత్తనాల అమ్మకంపై నిఘా విస్తృతం చేశారు. కొద్దిరోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని టీక్యా తండాలో పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకుని విక్రేత, సరఫరాదారుడిని అరెస్టు చేశారు. తాజాగా పోలీసులు విత్తన దుకాణాల్లో తనిఖీలు కూడా చేపట్టారు. ఆయా జిల్లాలోని విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలిస్తున్నారు. నకిలీ, అనుమతి లేని విత్తనాల అమ్మకం జరగకుండా వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో ఎన్ఫోర్స్మెంట్ బృందాల ఏర్పాటు జరిగింది.

# నకిలీ విత్తనాలు అమ్మితే 'పీడీ యాక్ట్'

- రైతులను మోసం చేస్తే రెండేళ్లు జైలుకే
- బీజీ-3 పత్తి విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధం
- భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

అక్షరదర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్పష్టం చేశారు. రైతులను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుని రెండేళ్ల వరకు జైలుకు పంపిస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో, సీసీఎస్ ఎస్సై రమేష్, ఆర్ఎస్ఐ రాజేష్, సిబ్బంది జిల్లాలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ




సందర్భంగా దుకాణదారులకు నకిలీ విత్తనాలు, ఎరువుల నివారణపై అవగాహన కల్పించారు.

**- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యంగా బీజీ–3 వంటి నిషేధిత పత్తి విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు జిల్లాలోని ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందాలు జిల్లావ్యాప్తంగా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతాయని పేర్కొన్నారు.


**- రైతులకు ఎస్పీ కీలక సూచనలు**

రైతులు కేవలం అధికారిక లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన ప్రతిసారీ తప్పనిసరిగా రశీదులు (బిల్లులు) తీసుకోవాలి. నకిలీ విత్తనాలు లేదా నకిలీ ఎరువుల విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, జిల్లా పోలీస్ అధికారులకు గానీ సమాచారం అందించాలి.

# హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**కాశిబుగ్గలోని నివాసంలో ఉరేసుకుని బలవన్మరణం**

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తీవ్ర విషాదం నెలకొంది. సంగెం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామారావు తన నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ రామారావు వరంగల్ లోని కాశిబుగ్గ ప్రాంతంలో నివాసముంటున్నారు. శుక్రవారం ఆయన తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.



**- ఆత్మహత్యపై విచారణ**

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రామారావు ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. తోటి ఉద్యోగి ఆకస్మిక మృతితో సంగెం పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు పోలీస్ శాఖలో విషాద ఛాయలు అలముకున్నాయి.